RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

**మంచిమాట**

నోరు విప్పేవరకూ మాటపైన పెత్తనం మనదే. నోరు జారితే ఆ మాటే మనపైన పెత్తనం చేస్తుంది.

ఆదివారం, 25 జనవరి 2026 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 04 | సంచిక 73

## నైనీ కోల్ టెండర్లు వివాదం

### కేంద్ర బృందం దర్యాప్తు ప్రారంభం



**హైదరాబాద్, జనవరి 24:** నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వివాదంపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిఆదేశాల మేరకు ఇద్దరు సభ్యుల సాంకేతిక కమిటీ సింగరేణి భవనానికి చేరుకుని విచారణను ప్రారంభించింది. సీఎస్ఆర్ నిధుల వినియోగం, టెండర్ నిబంధనలు వంటి అంశాలపై కేంద్ర బృందం ఆరా తీస్తోంది. సింగరేణి సీఎండీ కృష్ణ భాస్కర్ వద్ద ఈ బృందం వివరాలు సేకరిస్తోంది. (శుక్రవారం) రాత్రి 7 గంటలపాటు విచారణ జరిపింది. నేడు మరోసారి విచారణ చేపట్టిన బృందం వచ్చే సోమవారం తన నివేదికను కేంద్రానికి సమర్పించనుంది.కాగా.. నైనీ బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్?లో సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధన సరికాదని, అక్రమాలకు దారి తీస్తుందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో టెండర్లను రద్దు చేయాలని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించిన విషయం తెలిసిందే. అలాగే నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లలో అవినీతి ఆరోపణలపై స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. సమగ్ర విచారణకు సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు.ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందంతో కమిటీ ఏర్పాటైంది. బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, బొగ్గు శాఖ టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం సింగరేణిలో పర్యటించి.. నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై విచారణ జరిపి, ఆ నివేదికను మూడు రోజుల్లో అందజేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయి



**హైదరాబాద్, జనవరి24 :** కాంగ్రెస్ బీఆర్ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ షాకింగ్ కామెంట్స్ చేశారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని ఆరోపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి విచ్చేసిన ఆయన.. మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటు న్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే.. బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా అని మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెబుతున్నారని ప్రస్తావించారు.దోపిడీపై విచారణ జరపాలి.సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. 2014 నుంచి ఇప్పటివరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే.. గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని ఆరోపించారు. సింగరేణిపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో టైంపాస్ చేయొద్దని బండి అన్నారు. సింగరేణి అవకతవకలకు సంబంధించిన రికార్డులన్నీ వెంటనే సీజ్ చేయాలని కోరారు. లేనిపక్షంలో అవి తారుమారు చేసే ప్రమాదముందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.సింగరేణిని అప్పుల పాల్జేసింది.'కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని బండి సంజయ్ విమర్శించారు. ఆ సొమ్ముతోనే బీఆర్ఎస్‌ను ఇన్నాళ్లూ నడిపించారని ఆరోపించారు. 'రూ.42 వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంది. సింగరేణిని అప్పుల పాల్జేసింది. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు.

## సిట్ విచారణతో ఉక్కిరిబిక్కిరి

### - ఎర్రవల్లి ఫాంహౌస్‌కు కేటీఆర్, హరీశ్



**హైదరాబాద్, జనవరి 24:** మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు (శనివారం) మధ్యాహ్నం ఎర్రవల్లి ఫాంహౌస్‌కు వెళ్లనున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు సహా ముఖ్య నేతలు సమావేశం కానున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణలతో బీఆర్ఎస్ నాయకత్వం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి కేటీఆర్, హరీశ్ రావులను సిట్ విచారించిన విషయం తెలిసిందే. గులాబీ బాస్‌కు కూడా సిట్ నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సిట్ దూకుడు, భవిష్యత్ కార్యాచరణపై కేసీఆర్‌తో బీఆర్ఎస్ నేతలు చర్చించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నేతలకు మాజీ సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.


## భారత్‌పై టారిఫ్‌లు తగ్గించే యోచనలో అమెరికా



**న్యూ ఢిల్లీ :** ప్రభుత్వం భారత్‌కు శుభవార్త చెప్పే సూచనలు కనిపిస్తున్నాయి. భారత వస్తువుల దిగుమతులపై విధిస్తున్న భారీ సుంకాలను వైట్‌హౌస్ తగ్గించే యోచనలో ఉంది. ఈ విషయాన్ని అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ పరోక్షంగా వెల్లడించారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాపై అమెరికా ఆంక్షలు విధించింది. అయినప్పటికీ భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేసింది. దీనిపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అసహనం వ్యక్తం చేస్తోంది. రష్యా నుంచి ఆయిల్ కొంటున్నందుకు భారత్‌పై ఒత్తిడి తెచ్చేలా కఠిన నిర్ణయం తీసుకుంది. సాధారణ పన్నులతో పాటు అదనంగా 25 శాతం సుంకాన్ని విధించింది. దీంతో ప్రస్తుతం అమెరికాకు వెళ్లే భారత వస్తువులపై ఏకంగా 50 శాతం పన్నులు అమలవుతున్నాయి.అయితే, ఇటీవల కాలంలో భారత్ రష్యా నుంచి ముడి చమురు దిగుమతులను గణనీయంగా తగ్గించుకుంది. ఈ మార్పును అమెరికా సానుకూలంగా తీసుకుంది. రష్యా ఆయిల్ కొనొద్దన్న తమ లక్ష్యం నెరవేరినట్లేనని మంత్రి బెసెంట్ అభిప్రాయపడ్డారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, "రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించడం భారీ విజయం. ఆ కారణంతో విధించిన అదనపు టారిఫ్?లు ఇంకా అమల్లో ఉన్నాయి. ఇప్పుడు వాటిని తొలగించడానికి ఒక మార్గం దొరికిందని భావిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు.

## మేడారం కిటకిట

### - ఒక్కరోజే 3 లక్షల మందికు పైగా భక్తులు



**తాడ్వాయి(ములుగు):** మేడారం మహా జాతరకు మరో ఐదు రోజుల వ్యవధే ఉంది. ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున మేడారం తరలివస్తు న్నారు. మహా జాతరను తలపించేలా ప్రధాన కూడళ్లు, గద్దెలు, జంపన్నవాగు స్నాన ఘట్టాలు, తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు, ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ స్థలాలు, విడిది చేస్తే అటవీ ప్రాంతాల్లో భక్తజనంతో శుక్రవారం రద్దీగా మారాయి. 3 లక్షల మందికి పైగా భక్తులు ప్రైవేటు, ఆర్టీసీ వాహనాల్లో తరలివచ్చారు. దీంతో రోడ్లపై వాహనాలు బారులు తీరాయి. సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చిన భక్తులతో మేడారం పరిసరాలన్నీ జనసంద్రంగా మారాయి.వనదేవతలకు మొక్కుల్లో భాగంగా భక్తులు ముం దుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా ఎత్తు బంగారం(బెల్లం) నెత్తిన మోస్తూ కాలినడకన దేవస్థానంలోని తల్లుల గద్దెలకు చేరుకున్నారు. ఆదివాసీల ఆచార సంప్రదాయాలలో చీరె, సారె, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, బెల్లం, ఒడిబియ్యం, యాట మొక్కులను చెల్లించుకుని తల్లీ సల్లంగా చూడు.. మహా జాతరకు వస్తాం అని వేడుకున్నారు.

## పారిశుధ్యం ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలి



**తిరుపతి, జనవరి 24:** స్వచ్ఛాంధ్ర కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని.. అది మన జీవన విధానంగా మారాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం నగరిలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. నిరంతరం ప్రజాసేవలో పాల్గొని సమస్యలను పరిష్కరించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో స్వచ్ఛాం ధ్రను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం వదిలివెళ్లిన లెగసీ వేస్ట్‌ను ఏడాదిన్నరలో పూర్తిగా తొలగించామని చంద్రబాబు తెలిపారు.స్వచ్ఛమైన ఆలోచనలతోనే భవిష్యత్.పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నామని, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. విశాఖపట్నం, గుంటూ రులో ఇప్పటికే ప్లాంట్లు పనిచేస్తున్నాయన్నారు. రాజమండ్రి, నెల్లూరు, కడప, కర్నూలులోనూ నూతన ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపా రు. డ్వాక్రా సంఘాలు తయారుచేసిన కంపోస్ట్?ను రైతులకు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. చెడు ఆలోచనలతో నేరస్తులు రాజకీయాలు చేస్తే ఏమవుతుందో చూశామని, స్వచ్ఛమైన ఆలోచనలు ఉంటేనే భవిష్య త్తు ఉంటుందని సీఎం అన్నారు.ఓడీఎఫ్ ప్లస్ దిశగా అడుగులు.ఐదేళ్లలోనే ప్రపంచంలో అగ్రస్థానంలో ఉండేలా స్వచ్ఛాంధ్రను తీర్చిదిద్దుతామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏడాది నుంచి ఉద్యమంగా స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్రను నడిపిస్తున్నామని చెప్పారు. మార్చి నాటికి 1.12 కోట్ల టన్నుల చెత్తను పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. 2018లో ఆంధ్రప్రదేశ్ ను ఓడీఎఫ్(ఓపెన్ డిఫెకేషన్ ఫ్రీ)గా నిలబెట్టామని, ఇప్పుడు ఓడీఎఫ్ ప్లస్ దిశగా అడుగులు వేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.నగరిలో విస్తృత పర్యటనఅంతకముందు.. నగరి నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు విస్తృత పర్యటన చేపట్టారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు చంద్రబాబు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా నగరి చేరుకున్నా రు. ఈ కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణ ప్రచార రథాలను ఆయన ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులకు శానిటరీ పరికరాలను అందజేసి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన కార్మికులను అభినందించారు.ఆ తర్వాత స్టాల్స్?ను సందర్శించిన సీఎం.. ప్రకృతి వ్యవసాయం విషయంలో అధికారులను ప్రశ్నించారు. వారి సమాధానాలు సంతృప్తికరంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరికి 5000 ఎకరాలతో ఎకనమిక్ క్లస్టర్ ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సోమశిల నుంచి స్వర్ణముఖి ప్రాజెక్టు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ మాట్లాడుతూ.. తమ నియోజకవర్గానికి కృష్ణమ్మ నది నీటిని తీసుకురావాలని కోరారు. తాగునీటిలో రంగు కలుస్తున్న సమస్య ఉందని, దానికి త్వరితగతిన పరిష్కారం చూపాలని సీఎంను కోరారు ఎమ్మెల్యే.

## డిసెంబర్ దెబ్బ

### ఇండిగోకు బిగ్ షాక్

**న్యూ ఢిల్లీ :** దేశీయ విమానయాన రంగ దిగ్గజం ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ఈ ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో నిరాశా జనక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి కంపెనీ నికర లాభం ఏకంగా 78 శాతం తగ్గి రూ. 549.1 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే సమ యంలో కంపెనీ లాభం రూ. 2,448.8 కోట్లుగా ఉండటం గమనార్హం. ఈ ప్రభా వంతో స్టాక్ మార్కెట్?లో ఇండిగో షేర్లు సుమారు 4 శాతం వరకు నష్టపోయాయి. ఇండిగో లాభాలు భారీగా తగ్గడానికి ప్రధానంగా రెండు కారణాలను కంపెనీ పేర్కొంది. గతేడాది డిసెంబర్ ప్రారంభంలో విమాన సర్వీసుల్లో తలెత్తిన తీవ్ర అంతరా యాల వల్ల కంపెనీకి రూ. 577.2 కోట్ల మేర నష్టం వాటిల్లింది. . దీనికి తోడు కొత్త లేబర్ కోడ్ (కార్మిక చట్టాలు) అమలు చేయడం వల్ల మరో రూ. 969.3 కోట్ల భారం పడింది. మొత్తంగా ఈ క్యూ3లో కంపెనీపై సుమారు రూ. 1,546.5 కోట్ల వన్-టైమ్ భారం పడినట్లు వెల్లడించింది. విమానాల రద్దు, జాప్యం కారణంగా ప్రయాణికులు ఎదుర్కొన్న ఇబ్బందులకు గాను డీజీసీఏ ఇండిగోకు రూ. 22.2 కోట్ల జరిమానా కూడా విధించింది. కంపెనీ ఫలితాలు అంచనాల కంటే దారుణంగా ఉండటంతో మదుపర్లు షేర్ల అమ్మకాలకు మొగ్గు చూపారు.

## తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయి



**హైదరాబాద్ :** తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తు న్నాయన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా కథనాలు, పుకార్లు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడులు అంటూ ఒక పత్రిక రాసిన విషపు కథనంతో వివాదం మొదలైందని గుర్తు చేశారు. కట్టుకథలు, ఊహాగానాలతో రోజుకో కథ వండివారుస్తున్నారని, ఏ దోపిడీదారు కోసమే, ఎవరి ప్రయోజనాల కోసమో ఈ కథ నాలు వస్తున్నట్లు అనిపిస్తోందని, కొద్దిమందికి లబ్ధి చేసేందుకు సింగరేణిలో సైట్ విజిట్ అనే నిబంధన పెట్టారని ఊహించుకుని రాశారని తెలిపారు. అనుకున్న వ్యక్తులకు టెండర్లు ఇచ్చేందుకే నిబంధనలు మార్చారని కథలు అల్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సైట్ విజిటింగ్ అనేది తనకు మేలు జరిగేందుకే పెట్టా రని రాశారని, ఒక పత్రిక కథనం ఆధారంగా మరో నేత ఒక లేఖ రాశారని పేర్కొన్నారు.సింగరేణి అనేది ఒక అటానమస్ సంస్థ అని, సింగరేణి సంస్థలో ప్రతి నిర్ణయం మంత్రిమండలి వద్దకు రాదని భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి సంస్థ ప్రొసీజర్స్ ప్రకారమే నిర్ణయాలు జరుగుతాయని అన్నారు. ఆరోపణలు రాగానే టెండర్లు రద్దు చేయాలని చెప్పి వెళ్లిపోయానని, తర్వాత అయినా తప్పు గ్రహించి మార్చుకుంటారని భావించానని తెలిపారు.తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయి : భట్టి విక్రమార్క సైట్ విజిట్ అనే నిబంధన కోల్ ఇండియా 2018లో పెట్టిందని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. కోల్ ఇండియా నిబంధన ప్రకారమే సైట్ విజిట్ తప్పని సరి అని సింగరేణి సంస్థ 2021లో పెట్టిందని అన్నారు. 2018, 2021లో తాము అధికారంలో ఉన్నామా అని ప్రశ్నించారు. సెంట్రల్ మైనింగ్, డిజైనింగ్ అండ్ ప్లానింగ్ అనే సంస్థ సైట్ విజిట్ అనే నిబంధన పెట్టిందని, కేంద్ర ఆధీనంలోని ఎన్ఎండీసీ కూడా 2021లో బిడ్డర్లు సైట్‌విజిట్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలని నిబంధన పెట్టిందని అన్నారు.దేశంలోని చాలా కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర సంస్థలు సైట్ విజిట్ నిబంధనలు అమలు చేస్తున్నాయని, అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ రైల్వే, హిందూస్థాన్ కాపర్ లిమిటెడలోనూ ఇదే నిబంధన ఉందని, కాంట్రాక్టర్, వెండర్ సైట్ విజిట్ చేయాలని హెచ్‌పీసీఎల్‌లోనూ ఉందని గుర్తు చేశారు."తెలంగాణ ఆస్తులు పరిరక్షించడం నా బాధ్యత. సింగరేణి ప్రాంతంలో మండుటెండల్లో పాదయాత్ర చేశాను. మంచి క్వాలిటీ ఉన్న బొగ్గు గనులను సింగరేణి సంస్థ దక్కించుకునేలా కృషి చేస్తున్నాం. సింగరేణి సంస్థ కేవలం బొగ్గుకే పరిమితం చేయకుండా కీలక ఖనిజాల మైనింగ్ చేపట్టేలా చేసు న్నాం. నా పరువు, ప్రతిష్టకు భంగం కలిగేలా తప్పుడు కథనాలు రాశాను. 40 ఏళ్లుగా నేను సంపాదించుకున్న ప్రతిష్టను ఒక్క కథనంలో భంగం చేస్తానంటే ఊరుకోను. ఇప్పటికైనా వాస్తవం తెలుసుకుని తప్పు ఒప్పుకుంటారని ఆశిస్తున్నా."– భట్టి విక్రమార్క, డిప్యూటీ సీఎంటెండర్లు దక్కించుకున్నది బీఆర్ఎస నేతలే : సైట్ విజిట్ అనే నిబంధన దేశంలో ఎక్కడా లేదన్నట్లు దుష్ప్రచారం చేశారని, ఒక పత్రిక దురుద్దేశంతో రాసిన కథనం ఆధారంగా ఒక నేత లేఖ రాశారని గుర్తు చేశారు. టెండర్లు రద్దు చేయకపోతే ప్రజల్లో అపోహలు పెరుగుతాయని వెంటనే రద్దుకు ఆదేశించానని గుర్తు చేశారు. మైనింగ్ సంస్థల్లో వాహనాలు నడుపుతున్న వారికి డీజిల్‌పై పన్ను మినహాయింపు దేశంలో ఎక్కడా లేదని, డీజిల్ చోరీ జరగకుండా చూడాలని ఆదేశించానని, నైనీ కోల్ బ్లాక్‌కు బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిచారని అన్నారు. సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టులు జరిగేతే 20 టెండర్లు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, సృజన్‌రెడ్డి మామ ఉపేందర్?రెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకున్నది వాళ్లేనని, కాంట్రాక్టుల ఆశ చూపి కందాల ఉపేందర్‌రెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని తెలిపారు.

## ప్రమాదవశాత్తూ నీట మునిగి ఒకరు మృతి



**పాపన్నపేట,జనవరి,24, మెదక్ టుడే న్యూస్:** ప్రమాదవశాత్తూ నీట మునిగి ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చీకోడ్ గ్రామంలో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.గ్రామానికి చెందిన బోయిని సత్యనారాయణ(43) బతుకు దెరువు కోసం కుటుంబంతో కలసి హైదరాబాద్ లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు.కాగా మూడు రోజుల క్రితం కుమార్తె సీమంతం కోసం గ్రామానికి వచ్చారు.శుక్రవారం మధ్యాహ్నం సమయంలో సత్యనారాయణ కాలకృత్యాల కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు.రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు చుట్టూ పక్కల వెతికారు.గ్రామ శివారులోని చెరువు వద్ద సత్యనారాయణ చెప్పులు కనిపించగా అనుమానంతో చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది.మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## లక్ష్మీ సాయి మీడోస్ కాలనీలో మురుగు నీటి కష్టాలు: జోనల్ కమిషనర్‌కు వినతి



**అమీన్?పూర్ జనవరి: 24(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలోని బీరంగూడ డివిజన్ 270 పరిధిలోని లక్ష్మీ సాయి మీడోస్ కాలనీ వాసులు తీవ్ర డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం శనివారం అమీన్?పూర్ సర్కిల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులు జోనల్ కమిషనర్ శ్రీ హేమంత్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు.కాలనీ ఏర్పడిన కొత్తలో (సుమారు 13 ఏళ్ల క్రితం) ఏర్పాటు చేసిన డ్రైనేజీ పైపులు ప్రస్తుతం ఉన్న జనాభా అవసరాలకు సరిపోవడం లేదు. పైపులు ఇరుగ్గా ఉండటంతో తరచూ బ్లాకేజీలు ఏర్పడి మురుగు నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతోంది. గత రెండేళ్లుగా ఈ సమస్య మరింత జటిలమైందని, దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో కొన్ని ఇళ్లలోని బోర్ల ద్వారా కలుషిత నీరు వస్తోందని బాధితులు తెలిపారు. దీనివల్ల కాలనీలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వినతి పత్రంలోని ప్రధాన డిమాండ్లు కాలనీలోని లేన్ నెం. 5, 6, 3, 4, 2 మరియు 7 లలో తక్షణమే కొత్తగా సెంట్రల్ డ్రైనేజీ లైన్ల నిర్మాణం చేపట్టాలి.పెరిగిన జనాభాకు అనుగుణంగా పైపుల సామర్థ్యాన్ని పెంచాలి.ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. స్పందించిన జోనల్ కమిషనర్, సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీ నివాసితులు పాల్గొన్నారు.

## గంజాయి గ్యాంగ్ దాడిలో లేడీ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు - ఒక కిడ్నీ తొలగించిన వైద్యులు



**నిజామాబాద్** గంజాయి ముఠా చెలరేగిపోయింది. నిజామాబాద్ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య గంజాయి ముఠా దాడిలో గాయపడడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. నిందితుల కారును ఆపే ప్రయత్నంలో తీవ్ర గాయాలపాలైన సౌమ్య ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో అబ్కారీ శాఖ ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. ఉన్నతాధికారుల తీరుపై మండిపడుతు కానిస్టేబుళ్లు ఆందోళన చేశారు. ఈ ఘటనకు కారకులైన ఇద్దరిని అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు అబ్కారీ అధికారులు తెలిపారు. కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి అబ్కారీశాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు.కిడ్నీ తొలగించిన వైద్యులు : గంజాయి ముఠా దాడిలో నిజామాబాద్? ఎక్సైజ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడడం జిల్లాలో సంచలనంగా మారింది. శుక్రవారం సాయంత్రం నిజామాబాద్ శివారులోని మాధవనగర్?లో ఎక్సైజ్ ఠాణా సీఐ స్వప్న తన సిబ్బందితో రూట్? వాచ్ చేస్తుండగా అనుమానితుల కారును ఆపే ప్రయత్నం చేశారు. వారికి అడ్డుగా రెండు కార్లు నిలుపగా కారులో వస్తున్న వ్యక్తులు కారును తొలుత ఆపినట్లే ఆపారు. తర్వాత ఎక్సైజ్ అధికారులను తప్పించే ప్రయత్నంలో ఎదురుగా ఉన్న కానిస్టేబుల్ సౌమ్యపై నుంచి తీసుకెళ్లారు. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ రోడ్డుపై పడిపోగా కడుపులో తీవ్రగాయాలయ్యాయి. అధికారులు హుటాహుటిన ఆమెను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శస్త్రచికిత్స చేసిన వైద్యులు గాయమైన కిడ్నీని తొలగించారు.సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం తప్పకుండా అండగా ఉంటుంది : ఘటన జరిగిన వెంటనే కారును చుట్టుముట్టిన పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఒకరు మైనర్, మరో వ్యక్తి సయ్యద్ సోహెల్? నిర్మల్ జిల్లాకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను కలెక్టర్ ఇలా త్రిపాఠి పరామర్శించారు. సౌమ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. వైద్యులతో మాట్లాడి కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కానిస్టేబుల్ సౌమ్య కిడ్నీలు దెబ్బతిన్నాయని వైద్యులు చెప్పినట్లు కలెక్టర్ తెలిపారు. బాధితురాలు కోలుకుంటుందనే నమ్మకం ఉందని చెప్పిన కలెక్టర్ అవసరమైతే మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తామని అన్నారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం తప్పకుండా అండగా ఉంటుందని భరోసానిచ్చారు."సౌమ్యను పరామర్శించాను. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నాను. సౌమ్య కిడ్నీలు దెబ్బతిన్నాయని వైద్యులు చెప్పారు. సౌమ్య త్వరగా కోలుకుంటుందని అనుకుంటున్నాను. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తాం. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం తప్పకుండా అండగా ఉంటుంది." - ఇలా త్రిపాఠి, అబ్కారీశాఖ ఎస్?హెచ్?వో కార్యాలయం ముందు కానిస్టేబుళ్ల ధర్నా : గంజాయి ముఠా దాడిలో గాయపడ్డ మహిళా కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఎక్సైజ్? కానిస్టేబుళ్లు ఆందోళన నిర్వహించారు. నిజామాబాద్?లో ఎక్సైజ్?శాఖ ఎస్?హెచ్?ఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సీఐ స్వప్న గంజాయి స్మగ్లర్లతో చేతులు కలిపి అక్రమార్జనకు పాల్పడుతున్నారని సిబ్బంది ఆరోపించారు. కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి అండగా నిలవడంతో పాటు కారకులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్?కు న్యాయం జరిగే వరకు కార్యాలయం ఎదుట నుంచి జరిగేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. డీసీ సోమిరెడ్డి, సూపరిటెండెంట్ మల్లారెడ్డి వచ్చి వారితో మాట్లాడి కానిస్టేబుల్ కుటుంబానికి అన్ని విధాల న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గంజాయి స్మగ్లర్ల చేతిలో కానిస్టేబుల్ గాయపడడం దురదృష్టకరమని డీసీ సోమిరెడ్డి అన్నారు. విధుల్లో భాగంగానే గంజాయి బ్యాచ్?ను పట్టుకునేందుకు వెళ్లారని, ఈ ఘటన జరిగిన తీరు పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.గాలింపు చర్యలను ముమ్మరం : పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మత్తు ముఠాల ఆటకట్టించే క్రమంలో ఇలాంటి ఘటన జరగడంపై సర్కార్? తీవ్రంగా పరిగణిస్తోంది.

# భారతీ నగర్ డివిజన్‌లో రూ.10 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి








**రామచంద్రపురం జనవరి:24(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని భారతీ నగర్ డివిజన్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. శనివారం డివిజన్ పరిధిలో సుమారు రూ.10 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. 104 దుకాణాల బజార్ ప్రారంభం: బొంబాయి కాలనీ, కన్యకా పరమేశ్వరి ఆలయం సమీపంలో రూ.5.77 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక బజార్?ను మేయర్ ప్రారంభించారు. దీనివల్ల స్థానికులకు నిత్యావసరాలు ఒకే చోట లభ్యం కానున్నాయి.ఫంక్షన్ హాల్ అందుబాటులోకి: పేద, మధ్యతరగతి ప్రజల శుభకార్యాల కోసం రూ.2.47 కోట్లతో నిర్మించిన ఫంక్షన్ హాల్?ను జాతికి అంకితం చేశారు.కొత్త కమ్యూనిటీ హాల్?కు శంకుస్థాపన: ఎంఐజీ కాలనీ వాటర్ ట్యాంక్ సమీపంలో రూ.1.20 కోట్లతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ పనులకు మేయర్ భూమి పూజ చేశారు.కార్యక్రమానికి ముందు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , స్థానిక కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు వారికి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని, ముఖ్యంగా భారతీ నగర్ డివిజన్?లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర నేతలు మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తించి ఇలాంటి ప్రజా ఉపయోగకర కట్టడాలను నిర్మించడం సంతోషదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమిషనర్ హేమంత్, మాజీ ప్రోటెం చైర్మన్ భూపాల్ రెడ్డి, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అంజి రెడ్డి, భారతీ నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పా యాదవ్, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, రాజేశ్వర్ రెడ్డి, బి.ఆర్.ఎస్ నాయకులు బాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ యాదవ్, పరమేష్ యాదవ్, మరియు కాలనీ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**






**పటాన్ చెరు జనవరి: 24(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని క్రిస్టియన్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలోని చర్చిల కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 10 లక్షల 80 వేల రూపాయల విలువైన చెక్కులను శనివారం సాయంత్రం ఆయా చర్చిల పాస్టర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల మూలంగా చెక్కుల పంపిణీ ఆలస్యం జరిగిందని తెలిపారు. రెండు విడతలలో మొత్తం 70 చర్చిలకు 21 లక్షల రూపాయలను అందచేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నుండి మంజూరైన ప్రతి పైసాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, మెప్మ డిపిఓ స్వాతి, సిఓలు రేఖా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు గాలికొదిలేసి అక్రమ బోర్లు.. ప్రభుత్వ ఆదాయానికి గండి!






**అమీన్‌పూర్ జనవరి :24(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ మండల్ పరిధిలో అక్రమ బోరు బావుల తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇంటి నిర్మాణానికి ముందు బోరు వేయడం తప్పనిసరి అయినప్పటికీ, అందుకు సంబంధించిన ప్రభుత్వ నిబంధనలను బిల్డర్లు బేఖాతరు చేస్తున్నారు. నిర్మాణ ప్రాంతాల్లో ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండానే బోర్లు వేస్తూ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులను ఎగ్గొడుతూ ఖజానాకు గండి కొడుతున్నారు.

సాధారణంగా బోరు వేసే ముందు ఎమ్మార్వో కార్యాలయం నుండి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి. కానీ బిల్డర్లు తమ లాభమే పరమావధిగా చూసుకుంటూ అనుమతులు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు, బోరు మిషన్ యజమానులు కూడా కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. అనుమతి పత్రాలు చూసిన తర్వాతే బోరు బావి తవ్వాల్సి ఉన్నా, బిల్డర్లు అడిగిందే తడవుగా యంత్రాలను దింపుతున్నారు.పర్మిషన్ ఉంటేనే బోరు వేస్తాం" అని బిల్డర్లకు మరియు ఇంటి యజమానులకు బోరు మిషన్ ఓనర్లు స్పష్టం చేసేలా తహశీల్దార్ కార్యాలయం నుండి కఠిన ఆదేశాలు జారీ చేయాలని స్థానికులు అనుమతులు లేకుండా బోర్లు వేస్తున్న నిర్మాణ ప్రాంతాలను ఎమ్మార్వో తక్షణమే సందర్శించి చర్యలు తీసుకోవాలి. అనుమతి పత్రాలు అడగకుండా బోరు వేసే వాహనాలను సీజ్ చేయాలి.ఆదాయ వసూలు: ప్రభుత్వానికి రావలసిన పన్నులను బిల్డర్ల నుండి వసూలు చేయాలి.

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తున్న బిల్డర్ల "ఇష్టారాజ్యం" పై ఉన్నతాధికారులు దృష్టి సారించి, భూగర్భ జలాలను కాపాడటంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని రక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..

# ఫోన్‌ట్యాపింగ్ కేసులో దోషులకు కఠిన శిక్షలు తప్పవు



**హైదరాబాద్, జనవరి24 :** ఫోన్‌ట్యాపింగ్ కేసులోదోషులను కఠినంగా శిక్షపడేలా చూస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావుతెలిపారు. ఫోన్ ట్యాపింగ్ అనేది చాలా దుర్మార్గమని.. దానిని రాజకీయ కక్ష్య అని అనడం సరికాదని ఆయన అన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో దర్యాప్తు జరుగుతుందని స్పష్టం చేశారు. ఫోన్‌ట్యాపింగ్‌లో పాత్రధారులెవరో, సూత్రధారులెవరో తెలియాల్సి ఉందన్న మంత్రి.. దీనిని దిగజారుడు తనమే అంటారని చెప్పుకొచ్చారు. ప్రజాధనంతో నడిచేది విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ అని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏం చేసినా చూస్తూ ఊరుకోవాలా దర్యాప్తు జరిపించవద్దా.అని ప్రశ్నించారాయన.నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తాం.ఫోన్‌ట్యాపింగ్ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తామని మంత్రి జూపల్లి తెలిపారు. ఫోన్.. ట్యాపింగ్ అవుతుందని వి.ప్రకాశ్ అనే వ్యక్తి ఆరోజే చెప్పారని ప్రస్తావించారు. ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ కూడా ఫోన్‌ట్యాపింగ్ అయిందని గతంలో మాట్లాడారని గుర్తుచేశారు. ఐఏఎస్ అధికారులు ఆకునూరి మురళి సైతం ఈ అంశం గురించి మాట్లాడారని చెప్పుకొచ్చారు. మాజీ గవర్నర్ తమిళసై ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందని చెప్పారని ప్రస్తావించారు. మాజీ మంత్రి కేటీఆర్ సహా మరి కొందరి ఫోన్లు ట్యాపింగ్ అయ్యుండొచ్చని ఒప్పుకున్నారని జూపల్లి అన్నారు. తెలంగాణ రాష్టం ఏర్పాటు చేసుకున్నది ప్రజల సమస్యలు పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు.కేటీఆర్?కు 160 సీఆర్పీసీ కింద మాత్రమే నోటీసులు ఇచ్చారని.. నేరస్థులుగా పరిగణించలేదని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. సాక్షిగా సమాచారం కోసమే పోలీసులు కేటీఆర్‌ను విచారణకు పిలిచారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో పాటు కీలక పాత్ర పోషించిన కోదండరామ్‌నూ గతంలో అక్రమంగా అరెస్ట్ చేశారని వెల్లడించారు. చట్టం ప్రకారం నోటీసులిచ్చి పోలీసులు విచారిస్తారని చెప్పారు. వా×దీ చీఫ్ ప్రభాకర్ రావు.. అమెరికాకు ఎందుకు వెళ్లిపోయారని నిలదీశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు అమెరికా నుంచి ఇండియాకు వచ్చారని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు రావడానికి చాలా కారణాలున్నా యని చెప్పారు. పార్టీలకు అతీతంగా అందరూ విచారణకు వచ్చారని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమే కాంగ్రెస్‌కు శాపంగా మారబోతుంది



**నిజామాబాద్, జనవరి 24:** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కాంగ్రెస్ పార్టీకి రాబోయే రోజుల్లో శాపంగా మారనుందని బీఆర్ఎస్ లీగల్ సెల్ కన్వీనర్ దాదన్నగారి మధుసూదన్ రావు విమర్శించారు. ఈ వ్యవహారంలో లేనిది ఉన్నట్లు చిత్రీకరిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్రవిచిత్ర విన్యాసాలు చేస్తున్నదని అన్నారు. కేటీఆర్, హరీశ్‌రావులకు ఫోన్ ట్యాపింగ్ నోటీసులు అనే ఒక కల్పిత కథలో కథానాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, వారి అధినాయకుడు, సీఎం రేవంత్ రెడ్డే అని తెలిపారు.సిట్ ఇస్తున్న నోటీసులు చూసి తెలంగాణ ప్రజలు నొసలు వెక్కిరిస్తున్నారని మధుసూదన్ రావు విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమం నుంచి ఉద్భవించిన కేటీఆర్, హరీశ్‌రావు అనే ఉద్యమ శక్తులను ట్యాపింగ్ అనే తప్పుడు కేసుల్లో ఇరికించి ఏదో సాధిస్తామని కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారని అన్నారు. కాంగ్రెస్ కలల్ని కల్లలకు కాక తప్పదన్నారు. అభూత కల్పిత కథలతో అల్లిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమే కాంగ్రెస్ పార్టీకి శాపంగా మారబోతుందని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో న్యాయం బీఆర?స్ నాయకుల వైపే ఉందని స్పష్టం చేశారు.

# కాళేశ్వరం-మేడారానికి ప్రత్యేక బస్సులు



**మహదేవపూర్(కరీంనగర్):** మేడారం మహా జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం భూపాలపల్లి డిపో పరిధిలో మొత్తం నాలుగు క్యాంపులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజం హిందు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలో భూపాలపల్లి బఒస్టేషన్, కాటారంలో కాళేశ్వరం వెళ్లే మార్గంలో ఉన్న బస్‌స్టేషన్, కాళేశ్వరం లో కాళేశ్వరం బస్టాండ్?, మహారాష్ట్రలోని సిరొంచ బస్?స్టేషన్? పక్కన ఉన్న పార్కింగ్ ప్రదేశం నుంచి మేడారం అమ్మవారి గద్దెల వరకు మొత్తం 80 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆమె తెలిపారు. భూపాలపల్లి క్యాంపు ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు కొనసాగుతుందని, మిగిలిన కాటారం, కాళేశ్వరం, సిరొంచ క్యాంపులు ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని ఆమె వివరించారు.చార్జీల వివరాలిలా..భూపాలపల్లి నుంచి మేడారం వరకు పెద్దలకు రూ.230, పిల్లలకు రూ.140, కాళేశ్వరం నుంచి మేడారం వరకు పెద్దలకు రూ.360, పిల్లలకు రూ.210, సిరొంచ నుంచి మేడారం వరకు పెద్దలకు రూ. 400, పిల్లలకు రూ.230 ఉంటుందని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని భూపాలపల్లి, పరిసర ప్రాంతాల భక్తులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని డీఎం సూచించారు.

# టీ హబ్‌లోకి ప్రభుత్వ ఆఫీసులు వద్దు నిర్ణయం మార్చుకున్న సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ :**టీ హబ్ ను స్టార్టప్ కేంద్రంగా కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు.టీ హబ్‌ను ప్రత్యేక స్టార్టప్‌ల కేంద్రంగానే గుర్తించాలని సీఎస్‌కు ముఖ్యమంత్రి సూచించారు. ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్ క్యాటలిస్ట్‌గా స్టార్టప్‌లకు కేంద్రంగా ఏర్పాటు చేసిన టీ హబ్‌లో ఇతర ఆఫీసులు ఉండకూడదని, అలాంటి ఆలోచనలుంటే విరమించుకోవాలని ఆదేశించారు.

# జనగామలో పల్లాపై కాంగ్రెస్ గుండాల దాడి తీవ్రంగా ఖండించిన కేటీఆర్




**జనగామ :** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై కాంగ్రెస్ గుండాల దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సాక్షాత్తూ మంత్రి సీతక్క సమక్షంలోనే పట్టపగలు కొందరు కాంగ్రెస్ గుండాలు తాగొచ్చి వీధి రౌడీల్లా వ్యవహరించడం తెలంగాణలో దిగజారిన శాంతిభద్రతలకు అద్దం పడుతోందని విమర్శించారు.ఒకవైపు ముఖ్యమంత్రి అధికార మత్తులో విదేశాల్లో జల్సాలు చేస్తుంటే.. కాంగ్రెస్ గుండాలు మద్యం మత్తులో విర్రవీగుతూ విధ్వంసం సృష్టిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అధికారికంగా జరిగే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వద్ద కూడా "డ్రంక్ అండ్ డ్రైవ్" టెస్టులు పెట్టాల్సిన దుస్థితి తెలంగాణలో నెలకొని ఉందని విమర్శించారు. ముఖ్యమంత్రే స్వయంగా నేరాలను పెంచి పోషించేలా ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో లా అండ్ ఆర్డర్ ను తీవ్రంగా దెబ్బతీసే సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీతో పాటు తెలంగాణ సమాజం కూడా ఈ గడ్డపై ఇలాంటి ఫ్యాక్షన్ సంస్కృతిని ఎట్టిపరిస్థితుల్లో సహించదని స్పష్టం చేశారు. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు కర్రుగాల్చి వాతపెట్టిందన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రికి, అధికార పార్టీ అరాచక పర్వానికి తెలంగాణ ప్రజలు తప్పకుండా సరైన గుణపాఠం చెబుతారని అన్నారు.అసలేం జరిగిందంటే.జనగామ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనకు వచ్చిన మంత్రి సీతక్క సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులు గూండాయిజం ప్రదర్శించారు. మద్యం మత్తులో ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డిపై దాడికి యత్నించగా, బీఆర్ఎస్ శ్రేణులు ప్రతిఘటించి అడ్డుకు న్నాయి. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్?చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు ప్రశాంత్?రెడ్డి మద్యం మత్తులో తూగుతున్న అనుచరగణంతో కలిసి ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ పల్లాకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే పాల్గొన్న ప్రతి కార్యక్రమంలో కొమ్మూరి వర్గం నాయకులు, ఆయన కుమారుడి అనుచరగణం బీఆర్ఎస్, ఎమ్మెల్యే, కేసీఆర్‌ను నిందిస్తూ నినాదాలు చేశారు. దీంతో ఆగ్రహించిన బీఆర్ఎస్ శ్రేణులు భారీగా చేరుకొని ప్రతి నినాదాలతో కౌంటర్ అటాక్ చేయడంతో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. మద్యం మత్తులో ఎమ్మెల్యేపై దాడికి యత్నించిన కాంగ్రెస్ నాయకుడిని పోలీసు లు పక్కకు తీసుకెళ్లినా వారిని తోసుకుంటూ పెనుగులాటకు దిగాడు. కాంగ్రెస్? యువ నాయ కుడి 'గూండాగిరి'.అధికారికంగా జరుగుతున్న మంత్రి సీతక్క పర్యటనలో అడుగడుగునా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, చేర్యాల మాజీ ఎమ్మెల్యే కుమారుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి తన మార్క్?గూండాగిరిని ప్రదర్శించాడు. పట్టణంలో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి పర్యటనను రసాభాస చేసుకోవద్దని, కాంగ్రెస్ నాయకులు కావాలని గొడవ సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రహించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులను పలుమార్లు సముదాయించారు. అయిప్పటికీ తన అనుచరగణాన్ని ఎమ్మెల్యే పల్లాపైకి ఉసిగొల్పి దూషణల పర్వాన్ని కొనసాగించారు. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి కుమారుడు ప్రశాంత్‌డ్డితోపాటు అతడి అనుచరగణం అడ్డుపడటమేంటని ఎమ్మెల్యే పల్లా పోలీసులను ప్రశ్నించడంతో సీఐ సత్యనారాయ ణరెడ్డి కాంగ్రెస్ నాయకులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు.వివాదంపైమంత్రిసీతక్క సైతం అసహనం వ్యక్తంచేశారు.

# ఎక్సైజ్ సిబ్బందిని కారుతో ఢీకొట్టిన గంజాయి స్మగ్లర్లు



**నిజామాబాద్, జనవరి 14:** జిల్లాలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. నిజామాబాద్ నుంచి నిర్మల్ జిల్లాకు గంజాయిని తరలిస్తున్న ఓ ముఠా.. ఎక్సైజ్ శాఖ సిబ్బందిపై దాడి చేసింది. మాధవనగర్ ప్రాంతంలో గంజాయి రవాణా చేస్తున్న కారును ఆపి తనిఖీ చేయాలని ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య సహా ఇతర సిబ్బంది ప్రయత్నించగా.. స్మగ్లర్లు కారును వేగంగా నడిపి పోలీస్ సిబ్బందిని ఢీకొట్టారు. ఈ దాడిలో మహిళా కానిస్టేబుల్ సౌమ్యకు గాయాలయ్యాయి. ఆమెను వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఘటన జరిగిన వెంటనే పోలీసులు వాహనాన్ని వెంబడించి, కారును ఆపి ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 2 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.నిందితులు నిర్మల్ జిల్లాకు చెందిన వారని గుర్తించారు పోలీసులు. గంజాయి గ్యాంగ్ పారిపోతున్న కారు స్తంభానికి ఢీకొనడంతో వారు చివరికి పోలీసులకు చిక్కారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పురపాలక ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ



**హైదరాబాద్, జనవరి24 :** రాష్ట్రంలో త్వరలో జరగబోయే పురపాలక సంఘ ఎన్నికల్లో పోటీ చేయాలని తెలంగాణ జాగృతి నిర్ణయించింది. మరోవైపు ఆ పార్టీ ముఖ్య నేతలు రాజకీయ పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వేగం పెంచారు. పార్టీ రిజిస్ట్రేషన్ పూర్తి కావడానికి మూడు నెలల సమ యం పట్టే అవకాశం కనిపిస్తోంది. దీంతో మున్సిపాలిటీ, ఎంఒ టీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్?కు చెందిన సింహం గుర్తుతో పోటీ చేయాలని నిర్ణయించినట్లు సమా చారం. ఈ మేరకు ఏఐఎఫ్‌బీ రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపినట్లుగా తెలుస్తోంది. ఉమ్మడి గుర్తు కోసం ఆల్? ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ బీఫారంతో పోటీ చేయనున్నట్లుగా సమాచా రం.పురపాలక ఎన్నికలపై రాజకీయ పార్టీల గురి : పురపాలక ఎన్నికల నోటిఫికేషన్ 27న ప్రకటన ఇచ్చేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఈ తరుణంలో మున్సిపాలిటీల్లో విజయం సాధించాలని పలు పార్టీలు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నా యి. రాష్ట్రంలో పలు పురపాలికల పరిధిలో రాజకీయ సమీకరణలు జోరందుకున్నా యి. చైర్మన్ పీఠమే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు గెలుపు గుర్రాల కోసం వేగంగా పావులు కదుపుతున్నాయి.పురపాలక ఎన్నికలకు ఇటీవలే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే. తుది ఓటరు జాబితాలు, వార్డుల వారీగా రిజర్వేషన్లు ప్రకటించడంతో పలుచోట్ల ఎన్నికల హడావిడి మొదలైంది. త్వరలోనే షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండటంతో రాజకీయ పార్టీలు పలు వ్యూహాలు రచిస్తున్నాయి. తమ పార్టీ అభ్యర్థులను ఎలాగైనా గెలుపించుకోవాలని ప్రణాళికలు వేసుకుంటున్నాయి. స్థానిక ఎన్నికల్లో గెలుపొందిన విధంగానే పురపాలక పోరులో సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ ఉవ్విళ్లూరుతోంది. ఆ దిశగా తమ పార్టీ శ్రేణులను కదం తొక్కిస్తోంది.ఊపందుకున్న ప్రధాన రాజకీయ పార్టీల సంప్రదింపులు : మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న ఆశావహులతో పలు ప్రధాన రాజకీయ పార్టీలు సంప్రది ంపులు చేస్తున్నాయి. ప్రధానంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్? పార్టీ రిజర్వేషన్ ఆధారంగా పలుచోట్ల ఆశావహుల జాబితాతో సంప్రదింపులు జరుపుతున్నట్లుగా సమాచారం. గెలుపు గుర్రాల వేటలో అన్ని రాజకీయ పార్టీలు ఉన్నాయి. తాజాగా పురవార్డుల రిజర్వేషన్లు ప్రకటించడంతో ఆశావహులు అప్పటి వరకు వేసుకున్న వ్యూహాలను మార్చి, విజయం సాధించడం కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వారు గెలవగలిగే, సమీప వార్డులపై దృష్టి సారిస్తున్నారు. మహిళా రిజర్వేషన్లు అధికంగా ఉండటంతో వారి భార్యలను పోటీలో దించేందుకు మంతనాలు, సన్నాహాలు చేస్తున్నట్లుగా సమాచారం. వార్డుల్లో విజయం సాధించేందుకు స్థానిక కుల పెద్దలు, క్రియాశీల వ్యక్తులతో చర్చిస్తూ అభిప్రాయాల సమీకరణ జరుగుతోంది.ఈ నెల 27న షెడ్యూల్ విడుదల : రాష్ట్రంలోని ఏడు నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఎస్?ఈసీ రంగం సిద్ధం చేస్తోంది. ఈ నెల 27 తేదీన సాయంత్రం షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఆ రోజున ఉదయం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్? రాణికుముదిని సమావేశాన్ని నిర్వహిస్తారు. ఎన్నికల తుది ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన అనంతరం పురపాలక ఎన్నికల షెడ్యూలును విడుదల చేసే అవకాశం ఉంది.ఫిబ్రవరి 15లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్?ఈసీకి సూచించిన విషయం తెలిసిందే. షెడ్యూల్ మేరకు ఎన్నికల నోటిఫికేషన్? వెలువడిన 15 రోజుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఆ తర్వాత రెండు రోజులకు రిజల్ట్స్?ను వెల్లడించనున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా కలెక్టర్లతో దూరదృశ్య సమావేశం(వీడియో కాన్ఫరెన్స్) నిర్వహిస్తున్న ఎన్నికల సంఘం, చివరగా శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి, మెదక్? జిల్లాల పరిధిలోని జిల్లా కలెక్టర్లతో సమావేశమై ఏర్పాట్లకు సంబంధించి దిశానిర్దేశం చేసింది. శనివారం సాధారణ ఎన్నికల అబ్జర్వర్స్?ో, సాయంత్రం ఎన్నికల వ్యయ పరిశీలకులతో ఎస్ఈసీ సమావేశం కానుంది.

# నాంపల్లి ఫర్నీచర్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం



**హైదరాబాద్, జనవరి24:** నాంపల్లి ప్రాంతంలోని ఓ ఫర్నీచర్ గోదాంలో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. మంటలు గోదాంలోకి వ్యాపించాయి. ఉవ్వె త్తున ఎగిసిపడుతున్న మంటలను ఆర్పివేసే ందుకు అగ్నిమాపక శాఖ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ఘటనతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యా రుగ్రౌండ్ ఫ్లోర్ నుంచి మంటలుఫర్నీచర్ గోదాంలో మంటలు దట్టంగా వ్యాపించాయి. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి నాలుగు అంతస్తుల భవనమంతా క్రమంగా మంటలు అలుముకున్నాయి. దీంతో అగ్నిమాపక శాఖను వెంటనే అప్రమత్తం చేయడంతో నాలుగు ఫైరింజన్లతో మంటలను అదుపుచేసేందుకు యత్నిస్తున్నారు అగ్నిమాపక సిబ్బంది.భవనంలో పిల్లలు.ఈ ఘటన జరిగిన భవనంలో ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. దీనితో అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే చర్యలు తీసుకున్నారు. పిల్లలను సురక్షితంగా కాపాడేందుకు చర్యలు చేపట్టారు.

# ఆ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు బిగ్ షాక్




**హైదరాబాద్,**తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆసుపత్రులలో దీర్ఘకాలంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల సేవలను నిలిపివేస్తూ వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ నరేంద్ర కుమార్ అధికారిక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 776 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులను ప్రభుత్వం ఇటీవల మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్?మెంట్ బోర్డ్ (వీఎూ=దీ) ద్వారా భర్తీ చేసింది.ఈ ఎంపిక ప్రక్రియ పూర్తయి.. కొత్తగా ఎన్నికైన రెగ్యులర్ ఉద్యోగులకు నియామక పత్రాలు కూడా అందజేశారు. నిబంధనల ప్రకారం.. ఒక పోస్టులో రెగ్యులర్ ఉద్యోగి నియమితులైనప్పుడు.. ఆ స్థానంలో తాత్కాలికంగా పనిచేస్తున్న వారిని తొలగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం కొనసాగుతున్న కాంట్రాక్ట్ సిబ్బందిని విధుల నుంచి తక్షణమే తప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఈ నిర్ణయంపై డీఎంఈ కార్యాలయం శుక్రవారం అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాల్స్, ఆసుపత్రి సూపరింటెండెంట్లకు ఒక సర్క్యులర్ పంపింది. కొత్తగా చేరిన రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించి.. ఆ స్థానాల్లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను

మెదక్ టుడే
MEDAK TODAY తెలుగు దిన పత్రిక...
ఆదివారం, 25 జనవరి 2026

# బీఎంసీ మేయర్ ఎన్నిక వాయిదా గ్రూప్ రిజిస్ట్రేషన్ గందరగోళం



**ముంబై:** బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికకు చివరి నిమిషంలో అవాంతరం తలెత్తింది. దీంతో జనవరి 31న జరగాల్సిన మేయర్ ఎన్నిక ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా పడింది. బీజేపీ, షిండే సారథ్యంలోని శివసేన గ్రూప్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ముంబై మేయర్ పదవి కోసం బీజేపీ, షిండే శివసేన పోటీ పడుతున్న నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. బీఎంసీ మేయర్ పోస్టును లాటరీ పద్ధతిలో మహిళకు కేటాయించారు. జనవరి 31న ఓటింగ్? జరగాల్సి ఉంది. అయితే, బీజేపీ, శివసేన కార్పొరేటర్లు గ్రూప్ రిజిస్ట్రేషన్లను ఫైనలైజ్ చేయకపోవడంతో మేయర్ ఎన్నికల ప్రక్రియలో అవాంతరం తలెత్తింది. పోటీలో ఉన్న కూటములన్నీ భాగస్వామ్య ఒప్పంద పత్రాలను మున్సిపల్ సెక్రటరీ కార్యాలయంలో సమర్పించడం తప్పనిసరి. అంతవరకూ ఎన్నికల ప్రక్రియను చేపట్టే వీలుండదు. ఉద్ధవ్ శివసేన-ఎంఎన్ఎస్ కూటమికి చెందిన 65 మంది కార్పొరేటర్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. బీజేపీ-షిండే కూటమి ఇంకా పేపర్ వర్క్ పూర్తి చేయకపోవడంతో ఫిబ్రవరి మొదటి వారానికి మేయర్ ఎన్నిక వాయిదా పడింది. దీంతో ఉమ్మడి గ్రూపుగా రెండు పార్టీలు రిజిస్టర్ చేయించుకుంటాయా, వేర్వేరుగా రిజిస్ట్రర్ చేయించుకుంటాయా అనేది ఆసక్తికరంగా మారిందిబీఎంసీలో మూడు దశాబ్దాలపాటు సాగిన ఠాక్రేల పట్టుకు ఇటీవల జరిగిన మహారాష్ట్ర పురపోరులో బీజేపీ-షిండే శివసేన గండి కొట్టాయి. 29 మున్సిపల్ కార్పొరేషన్లలో 25 కార్పొరేషన్లను మహాయుతి కూటమి దక్కించుకుంది. ప్రధానంగా 227 మంది సభ్యుల బీఎంసీలో మెజారిటీ మార్క్ 114 కాగా, బీజేపీ-శివసేన కూటమి 118 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 89, శివసేన 29 సీట్లు గెలుచుకోగా, శివసేన యూబీటీ-ఎంఎన్?ఎస్ కూటమి (65о6) 71 సీట్లు సాధించాయి. కాంగ్రెస్ 24 సీట్లు, ఏఐఎంఐఎం 8 సీట్లు దక్కించుకున్నాయి.

# గవర్నర్ పదవిని ఆర్ఎన్ రవి అవమానిస్తున్నారు గతంలో ఆయనలా ఎవరూ లేరు



**తమిళనాడు :** అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో ప్రసంగాన్ని చదవకుండా గవర్నర్ ఆర్ఎన్ రవి తన పదవిని అవమానించారని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆరోపించారు. ఆయన చర్యలను విమర్శించక తప్పడం లేదని, గతంలో తమిళనాడుకు వచ్చిన గవర్నర్లు ఎవరూ రవిలా లేరని అన్నారు. దేశభక్తి తమకు గౌరవం ఉందని, ఎవరూ పాఠాలు నేర్పించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'సమావేశాల ప్రారంభంలో ప్రసంగం చదవకపోవడం ద్వారా గవర్నర్ తన పదవిని అవమానిస్తున్నారు. గవర్నర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వవ్యహరిస్తున్నారు. ఆ ఒక్క కారణాన్ని చెప్పి పదే పదే అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నారు. దేశం, జాతీయ గీతం పట్ల మాకు గౌవరం ఉంది. ఈ విషయంలో ఎవరూ పాఠాలు నేర్పించాల్సిన అవసరం లేదు. మాజీ ముఖ్యమంత్రులు సీఎన్ అన్నాదురై, ఎం కురణానిధి, ఎంజీఆర్, జయలలిత హయాంలో చూడని సంక్షోభాన్ని నేను ఎదుర్కొంటున్నా. ఇదేం నాకు కొత్త కాదు. గతంలో నేను అనేక సవాళ్లను ఎదుర్కొని వాటిని అధిగమించా' అని ఎంకే స్టాలిన్ అన్నారు.

# 61 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, జనవరి 24:** దేశవ్యాప్తంగా(శనివారం) జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా 45 కేంద్రాల నుంచి నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ. మొత్తం నియామకాల్లో 49,200.. హోంమంత్రిత్వ శాఖ, పారామిలిటరీ దళాలకు సంబంధించినవని తెలిపారు. మహిళా కానిస్టేబుల్స్ భారీగా నియమితులవుతున్నారని, గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక సౌలభ్య చర్యలు తీసుకున్నందు వల్ల ఇది సాధ్యమైందని వివరించారు.బీఎస్ఎఫ్ మహిళా దళాలు సరిహద్దుల్లో జీరో లైన్ వద్ద ఉద్యోగాలు చేస్తున్నాయని, రిపబ్లిక్ డే పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ పురుష దళానికి మహిళా అసిస్టెంట్ కమాం డెంట్ నాయకత్వం వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిం చడం, ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతోందని మోదీ పేర్కొన్నారు.ఈ మేళాల ద్వారా ఇప్పటివరకూ 11 లక్షలకు పైగా నియామక పత్రాలు విడుదల చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు.. హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య విభాగాలతోపాటు ఇతర శాఖల్లో ఈ నియామకాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు.

# పంజాబ్‌లో ఉగ్రవాద కుట్ర భగ్నం.. భారీఎత్తున ఆయుధాలు స్వాధీనం



**పంజాబ్ :** గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దేశవ్యాప్తంగా ఉగ్ర ముప్పుఉందని ఇటీవల ఇంటెలిజెన్స్ బ్యూరో రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే పంజాబ్ పోలీసులు భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేశారు. పంజాబ్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ ఆపరేషన్?లో నిషేధిత ఉగ్రసంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ కి చెందిన టెర్రర్ మాడ్యూల్?ను గుర్తించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పెద్దఎత్తున భయాందోళన సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు పంజాబ్ డీజీపీ తెలిపారు.నిందితుల వద్ద నుంచి 2.5 కిలోల ఆర్డీఎక్స్ తో తయారు చేసిన ఒక ఇంప్రొవైజ్డ్ ఎక్స్ ప్లోసివ్ డైవైస్, రెండు గన్స్, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఉగ్ర మాడ్యూల్ అమెరికా లో ఉన్న హ్యాండ్లర్లు నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై చట్ట విరుద్ధ కార్యకలాపాల చట్టం, పేలుడు పదార్థాల చట్టానికి సంబంధించిన పలు సెక్షన్ల కింద హోషియార్?పూర్?లోని గర్శంకర్ పోలీస్ స్టేషన్?లో కేసు నమోదు అయ్యింది. ప్రస్తుతం దీనిపై పూర్తి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

# ట్రంప్ వ్యాఖ్యలు కొత్తవేం కాదు- దేనికైనా మేం రెడీ




**ఇరాన్ :** ఇరాన్‌ను నాశనం చేస్తానని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఆ దేశ ప్రతినిధి డాక్టర్ అబ్దుల్ మజీద్ హాకీం ఇలాహీ మండిపడ్డారు. ట్రంప్ వ్యాఖ్యలు కొత్తవి కాదని, అయినా దేనికైనా తాము సిద్ధంగా ఉన్నట్లు భారత్‌లో ఉన్న ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఓ వార్తసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వ్యాఖ్యలు చేశారు. తనపై హత్యకు పాల్పడితే ఇరాన్‌ను అమెరికా నాశనం చేస్తుందని ఇటీవల ట్రంప్ వ్యాఖ్యానించారు.'మేం శాంతి, భద్రత కోరుకుంటున్నాం. కానీ కొందరు ఈ పరిస్థితిని సృష్టించారు. దీని వల్ల మొత్తం పశ్చిమాసియా నాశనం అవుతోంది. అన్ని దేశాలు ప్రభావితమవుతాయి. ఇరాన్ శత్రువులు బయట నుంచి యువతను రెచ్చగొడుతున్నారు. అందుకే అంతర్జాతీయ ఇంటర్నెట్‌ను తాత్కాలికంగా నిలిపేశాం. స్థానిక ఇంటర్నెట్ మాత్రం పనిచేస్తోంది. సోషల్ మీడియాను పూర్తిగా నియంత్రించ డం చాలా కష్టం. ఇరాన్?కు అనేక శత్రువులు ఉన్నారు. 250కి పైగా ఛానళ్లు 24 గంటలూ ఇరాన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయి' అని డాక్టర్ అబ్దుల్ మజీద్ తెలిపారునిరసనకారులు ఇతర దేశాల నుంచి వచ్చారా అని ప్రశ్నకు వారు ఇరాన్ పౌరులే అని అబ్దుల్ బదులిచ్చారు. కానీ వారు హింసకు పాల్పడుతున్నారని అన్నారు. వారు విదేశాల్లో లేదా ఇరాన్‌లో చదువుకుంటున్నారు. సోషల్? మీడియా ద్వారా అమాయక ప్రజలకు చంపడానికి, ఆసుపత్రులు, మసీదులు, గ్రంథాలయాలను తగలబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. కొంతమంది నిరసనకారులు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకున్నారు. చాలామంది తమ దుకాణాల్లో, ఆసుపత్రుల్లో, మసీదుల్లో పనిచేస్తున్న అమాయక ప్రజలు. వారిని ఈ నిరసనకారులే చంపారు. కొందరు నిరసనకారులు పోలీసులపై దాడి చేశారు. పోలీసులు వారిని ఆపే ప్రయత్నంలో మృతిచెందారు' అని మజీద్ ఇలాహీ తెలిపారు.'ఆ సంస్థలు బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తించాలి'ఐక్యరాజ్య సమితి అత్యవసర సమావేశంపై డాక్టర్ అబ్దుల్ మజీద్ స్పందించారు. కొన్ని అంతర్జాతీయ సంస్థలు ప్రపంచంలో తమ ప్రభావాన్ని కోల్పోయాని తెలిపారు. మరికొన్ని సంస్థలు కొన్ని దేశాల చేతుల్లోనే ఉన్నాయని చెప్పారు. అవి తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, ప్రజలు, దేశాల ప్రయోజనాల కోసం పనిచేస్తాయని తాము అశిస్తున్నామని అన్నారు. ఇరాన్ పరిస్థితులపై ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి జనవరి 23న ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది.'అణ్వాయుధాలను అభివృద్ధి చేయాలని ఇరాన్‌కు లేదు'ఇక ఇరాన్ అణు కార్యక్రమంపై కూడా అబ్దుల్ మాజీద్ మాట్లాడారు. ఇరాన్ ఎప్పుడూ అణ్వాయుధాలను అభివృద్ధి చేయాలనుకోలేదని పేర్కొన్నారు. శాంతియుత అణు శక్తికే కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా సయ్యద్ అలీ ఖమేనీ జారీ చేసిన ఫత్వా ప్రకారం అణ్వాయుధాలు కలిగి ఉండటం వినియోగించడం నేరం. అందుకే ఇరాన్ అణ్వాయుధాలను ఎప్పుడూ కోరుకోలేదు. అయితే శాంతియుత అవసరాల కోసం అణు సాంకేతికతను అభివృద్ధి చేసుకునే హక్కు ఇరాన్‌కు ఉంది. సామాజిక అభివృద్ధి, మానవతా అవసరాలు, వైద్య చికిత్సలు, శక్తి ఉత్పత్తి కోసం శాంతియుత అణు శక్తిని కలిగి ఉండాలని ఇరాన్ కోరుకుంటుంది' అని అబ్దుల్ మజీద్ తెలిపారు.మరోవైపు అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంటోంది. భారీ స్థాయిలో అమెరికా సైన్యం ఇరాన్ దిశగా కదులుతోందని ట్రంప్ వెల్లడించారు. ఏమీ జరగకుండా ఆపడమే తనకు ఇష్టమని, తాము ఇరాన్‌ను చాలా నిశితంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక నిరసనకారులను చంపడాన్ని ఇక ఆపాలని తెలిపారు. . అలాగే అణ్వస్త్ర కార్యక్రమాన్ని మళ్లీ మొదలుపెట్టాలనే ఆలోచనను కూడా పక్కనపెట్టాలని ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు తమ వేలు ట్రిగ్గర్‌పైనే ఉందని ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్(ఐఆర్‌జీసీ) హెచ్చరించింది.

# అహ్మదాబాద్ విమానం దుర్ఘటన ఎయిరిండియాకు రూ.1,100 కోట్ల బీమా సొమ్ము



**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్‌లో గత ఏడాది జూన్ 12న ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటన తీవ్ర సంచలనమైంది. ఈ ఘటనలో విమానంలోని 241 మంది ప్రయాణికులతో సహా మొత్తం 260 మంది మృతి చెందారు. ఈ ప్రమాద ఘటనలో ఎయిరిండియాకు పలు బీమా కంపెనీలు, రీఇన్సూరర్ల నుంచి తాజాగా పరిహారం అందింది. ఎయిరిండియాకు 125 మిలియన్ డాలర్లు (రూ.1,100 కోట్లకు పైగా) పరిహారం చెల్లించినట్టు బీమా వర్గాలు తెలిపాయి.ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు 25 మిలియన్ డాలర్లు (రూ.225 కోట్లు) పరిహారంగా చెల్లించినట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. పరిహారం పంపిణీ ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని, ఆ మొత్తం పెరిగే అవకాశం ఉంది తెలిపాయి.గత ఏడాది అహ్మదాబాద్ నుంచి లండన్?కు బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్?లైనర్ విమానం టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే కుప్పకూలింది. మెడికల్ కాలేజీ హాస్టల్?పై పడటంతో విమానంలోని 242 మందిలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. గ్రౌండ్?లోని మరికొందరితో కలిపి మృతుల సంఖ్య 260 మందికి చేరింది. మృతుల్లో 169 మంది ఇండియన్లు, 53 మంది బ్రిటన్ పౌరులు, ఏడుగురు పోర్చుగల్ వాసులు, ఒక కెనడియన్ ఉన్నారు. విమానంలోని ఇద్దరు పైలట్లు, 10 మంది సిబ్బంది సైతం ప్రాణాలు కోల్పోయారు.

# చైనా మిమ్మల్ని తినేస్తుంది కెనడాకు ట్రంప్ హెచ్చరిక





**అమెరికా:** మిసైల్ రక్షణ వ్యవస్థ గోల్డెన్ డోమ్ ఏర్పాటు ప్రతిపాదనలను కెనడా వ్యతిరేకిస్తుండటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదోక రోజు కెనడా చైనాకు బలైపోతుందని వ్యాఖ్యానించారు. చైనాతో దౌత్య, వాణిజ్య బంధాల బలోపేతానికి కెనడా ప్రయత్నిస్తున్న తరుణంలో ట్రంప్ ఈ హెచ్చరిక చేశారు.'గ్రీన్‌లాండ్‌కు రక్షణగా గోల్డెన్ డోమ్ ఏర్పాటును కెనడా వ్యతిరేకిస్తోంది. కెనడాకూ ఈ వ్యవస్థతో రక్షణ లభించే అవకాశం ఉన్నా అడ్డుకుంటోంది. ఇది చాలదన్నట్టు వారు చైనాతో వాణిజ్యానికి మొగ్గుచూపుతున్నారు. ఒప్పందం కుదిరిన మొదటి సంవత్సరంలోనే వారు చైనాకు ఆహారమైపో తారు' అని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా ట్రంప్ హెచ్చరించారు.కెనడా, అమెరికాల మధ్య కొంత కాలంగా అసలేమాత్రం పొసగని విషయం తెలిసిందే. ఇక దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశాల్లో ఇరు దేశాల మధ్య ఎడం మరింత పెరిగింది. ట్రంప్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వ తీరును కెనడా ప్రధాని కార్నీ ఎండగట్టారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ నియమాలకు కాలం చెల్లినట్టు కనిపిస్తోందని అన్నారు.దీంతో, ట్రంప్ కూడా అంతేఘా టుగా స్పందించారు. ఇంతకాలం అమెరికా ఇచ్చే అనేక ఉచితాలను అనుభవించిన కెనడా కాస్తంత కృతజ్ఞతతో మసులుకోవాలని అన్నారు. కానీ వారిలో కృతజ్ఞత కనిపించట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తను ప్రతిపాదించిన గోల్డెన్ డోమ్‌తో కెనడాకు కూడా రక్షణ లభిస్తుందని అన్నారు.ఏమిటీ గోల్డెన్‌డోమ్ ప్రాజెక్టు.మిసైల్ దాడుల నుంచి రక్షణ కోసం అమెరికా ప్రభుత్వం గతేడాది తొలిసారిగా ఈ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ ఏర్పాటు చేసుకున్న ఐరోన్ డోమ్ వ్యవస్థ స్ఫూర్తితో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. మొదట్లో దీన్ని ఐరన్ డోమ్ ఆఫ్ అమెరికాగా మీడియాలో పేర్కొన్నప్పటికీ ఆ తరువాత ప్రభుత్వం గోల్డెన్ డోమ్‌గా పేరు మార్చింది. ఇందుకు అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని కెనడా ప్రభుత్వం భరిస్తే ఆ దేశానికి రక్షణ కల్పిస్తామని తెలిపింది. అమెరికా భద్రతకు గ్రీన్‌లాండ్ కీలకంగా మారిందని చెబుతున్న ట్రంప్ అక్కడకు కూడా గోల్డెన్ డోమ్ రక్షణను విస్తరిస్తామని చెబుతున్నారు.అయితే, కెనడా మాత్రం ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. గోల్డెన్ డోమ్ ప్రతిపాదన తమ ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేలా ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. చైనాతో వాణిజ్య సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు కూడా కెనడా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ అనుసరిస్తున్న విధానాలను కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

# దాల్ గేట్ గెస్ట్ హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం



**శ్రీనగర్ :** శ్రీనగర్‌లోని దాల్‌గేట్ తీరాన ఉన్న గెస్ట్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారమందుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువస్తున్నారు. ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసెస్ కమాండ్ వివరాల ప్రకార ం. ప్రాథమిక అంచనా ప్రకారం దాల్ ఫాగ్ అనే మూడు అంతస్థుల గెస్ట్ హౌస్‌లో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. భారీగా నష్టం సంభవిం చింది. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది తక్కువ సమయంలో మంటలను అదుపులోకి తీసుకువచ్చింది.షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలగా.. అగ్నిప్రమాదానికి గల కారణాలపై విశ్లేషించేందుకు దర్యాప్తు కొనసాగుతున్నట్టు పేర్కొంది. ఘటనా స్థలంలో ఏవైనా డెడ్‌బాడీలు కానీ.. ఇతర మండే పదార్థాలు కానీ ఉన్నాయా.. అని తెలుసుకునే స్పెషల్ డాగ్ స్క్వాడ్ టీం పరిశీలిస్తుందని.. ఇప్పటివరకు ఒకరికి గాయాలయినట్టు నిర్ధారణ అయిందని.. ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని పేర్కొంది.

# బంగాల్‌లో హడావుడిగా సామాన్యులు ఓటు హక్కు కోల్పోయే ఛాన్స్:



**బంగాల్:** బంగాల్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ (92 ఏళ్లు) తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరికొద్ది నెలల్లో బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో, ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత వేగంగా, హడావుడిగా, అనవసర తొందరపాటుతో నిర్వహిస్తున్నారని, దీని వల్ల ప్రజాస్వామ్య భాగస్వామ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. బోస్టన్ నుంచి ఓ ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఓటర్ల జాబితా సవరణ అనేది చాలా పారదర్శకంగా, తగినంత సమయం కేటాయించి చేయాల్సిన ప్రక్రియ. కానీ బంగాల్‌లో ప్రస్తుతం ఎస్ఐఆర్ జరుగుతున్న తీరు చూస్తుంటే, అది చాలా లోపభూయిష్టంగా కనిపిస్తోంది. ఓటర్లు తమ అర్హతలను నిరూపించుకోవడానికి అవసరమైన పత్రాలను సమర్పించేందుకు తగినంత సమయాన్ని ఎన్నికల అధికారులు ఇవ్వడం లేదు. ఇది ఓటర్లకు అన్యాయం చేయడమే అవుతుంది. అంతేకాదు ఇది భారత ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసే అవకాశం ఉంది."– అమర్త్యసేన్, ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీతమా అమ్మ వయస్సు గురించి అడిగారు!ఎస్?ఐఆర్? నిర్వహిస్తున్న ఎన్నికల అధికారుల తీరును అమర్త్యసేన్ ఎండగట్టారు. "కొన్ని సార్లు ఎన్నికల సంఘం అధికారులకే తగినంత సమయం లేనట్లు అనిపిస్తోంది" అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన తన సొంత అనుభవాన్ని పంచుకున్నారు. "నా సొంత నియోజకవర్గం లరికార్డుల్లో ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు నా అర్హతలపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. నా పుట్టిన తేదీ నాటికి మా దివంగత అమ్మగారి వయస్సు ఎంత అని అడిగారు. వాస్తవానికి మా అమ్మ కూడా ఓటరుగా ఉంటే, ఆమె వివరాలు వారి వద్దే ఉంటాయి కదా" అని అమర్త్యసేన్ ప్రశ్నించారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..